



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు



రైతులను సముదాయిస్తున్న పోలీసులు

యూరియా కోసం బైఠాయింపు

బీంపూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒక్కొకరికి రెండు బ్యాగుల యూరియా బ్యాగులు మాత్రమే ఇస్తున్నారని, తమకు ఇదెక్కడ సరిపోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీంపూర్‌లో రైతులు సోమవారం రోడ్డుపై బైఠాంచి ఆందోళనకు దిగారు. రైతులందరూ పాసు బుక్‌లు, ఆధార్ కార్డు ఇచ్చి రోజులు గడుస్తున్నా.. యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా పలువురు నాయకులు సైతం పాల్గొనడంతో రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద కాలనీలోని ఓ ఇంటి ఆవరణలో అడవి పంది

కాలనీల్లోకి అడవిపందులు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జవహర్‌నగర్, అంబేద్కర్ నగర్, భీమన్న కాలనీ, శివాజీ మార్కెట్ కాలనీలలో అడవిపందులు తిరుగుతుండడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం ఇంటి ఆవరణలోకి వచ్చిన అడవి పందిని చూసి ఓ మహిళ భయంతో పరుగులు తీసింది. గత 20రోజులుగా అడవిపందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. రాత్రి వేళలో కాలనీవాసులు బయటికి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది అడవి పందులు రాకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



● భీంపూర్‌లో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

- జిల్లాలో సొసైటీల వద్ద క్యూ కడుతూ రోజంతా పడిగాపులు
- యూరియా కొరతతో పంటల ఎదుగుదలపై ప్రభావం
- నానో యూరియాపై ఆసక్తి చూపని అన్నదాతలు
- సరఫరాపై చేతులెత్తేస్తున్న జిల్లా అధికారులు
- జిల్లావ్యాప్తంగా ఈయేడు 5.72 లక్షల ఎకరాలల్లో వివిధ రకాల పంట సాగు

ఇంకెన్నాళ్లు?

పంటల సాగుకు.. అవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు గోస పడుతున్నారు. ఈయేడు వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి యూరియా కొరత తీవ్రంగా కనిపిస్తుంది. జిల్లాలో వర్షాధారంగా పండించే ఆరుతడి పంటలైనా పత్తి, సోయా, కంది, మొక్కజొన్న పంటలనే ఎక్కువగా సాగు చేస్తారు. ఈయేడు జిల్లా సాగు విస్తీర్ణం 5లక్షల 72వేలు కాగా ఇందులో అధికంగా పత్తి పంటనే 4లక్షల 35వేల ఎకరాలలో సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతులకు తప్పని యూరియా గోస

ఆదిలాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి పంట సాగు జిల్లాలో కనీస స్థాయిలోనే కనిపిస్తుంది. అయినా యూరియా ఇబ్బందులు తప్పడం లేదు. పంటల ఎదుగుదలకు ఉపయోగించే యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం నుంచే అవసరం మేరకు యూరియా సరఫరా కావడం లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో రైతులు ధర్నాలు, రాస్తారోకోలకు దిగుతున్నారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయాలంటూ ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నాయి. సోమవారం భీంపూర్ మండలంలో రైతులు యూరియా కోసం రోడ్డెక్కారు. ఈసారి వానాకాల సీజన్ పంటల సాగుకు 36వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు 31వేల మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు సరఫరా అయినట్లు తెలుస్తుంది. మరో 5వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉంది. ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా 17వేల ఎకరాలకు పైగా పంటలు నీటమునిగి నష్టపోయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ప్రస్తుతం పత్తి, సోయా పంటలు కాయ దశలో ఉన్నాయి. ఈ సమయంలో యూరియా, ఎరువులను వేయకుంటే సరైన దిగుబడులు రావని రైతులు వాపోతున్నారు.

గంటల తరబడి క్యూలైన్లలో..

రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి యూరియాను కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం నుంచి సొసైటీలు, ఫర్టిలైజర్ షాపుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గతంలో యూరియాను కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్మేసుకున్న దాఖలాలు ఉన్నాయి. దీంతో తప్పనిసరిగా

(తరువాయి 6వ పేజీలో....)



● ఇచ్చోడలో సొసైటీ వద్ద క్యూలో నిలబడిన రైతులు

యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నాం

: రాంవిలాస్, రైతు, ధనోరా, భీంపూర్ మండలం



ఈయేడు యూరియా దొరకడమే బంగారమైంది. నిత్యంయూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నాం. సకాలంలో యూరియా దొరకక పంటల ఎదుగుదల నిలిచి పోతుంది. దీంతో ఆశించిన దిగుబడులు వస్తాయో రావోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. పంటలను సాగు చేసేందుకు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్లో మద్యం దొరికినట్లు ఎరువులు దొరకడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడంతోనే రైతులు పడరాని గోసపడుతున్నారు.

యూరియా వాడకం భారీగా తగ్గింది

: శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఆదిలాబాద్



ప్రస్తుతం జిల్లాలో యూరియా వాడకం భారీగా తగ్గింది. పత్తి పంట కాయ దశలో ఉన్నప్పుడు యూరియా అవసరం ఉండదు. అయిన కొంత మంది రైతులు జొకుబట్టిన భూముల్లో యూరియాను వాడేందుకు కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల చివరి వరకు మాత్రమే యూరియా అవసరం ఉంటుంది. ఆ తర్వాత పెద్ద అవసరం ఉండదు. జిల్లాకు మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేస్తే సరిపోతుంది. ఇప్పటి వరకు 31వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న విధంగా ఈ సంవత్సరం సైతం దేవీ శరన్నవరాత్రోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పట్టణంలోని బ్రాహ్మణవాడలోని బొజ్జావార్ మందిరంలో కొనసాగుతున్నాయి. ఈనెల 22 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు శరన్నవరాత్రోత్సవాలు కొనసాగనున్నాయి. దుర్గాపూజ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నవరాత్రోత్సవాల కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను సమితి ప్రతినిధులు సోమవారం బొజ్జావార్ మందిరంలో ఆవిష్కరించారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆవిష్కృతమైన కరపత్రాల వివరాలను సమితి అధ్యక్షుడు రఘు జోషి తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పంకజ్ దేష్పాండే, కోశాధికారి జవ్వాజి కృష్ణ, ఉపాధ్యక్షుడు ఆత్ సాయర్వార్, సంయుక్త కార్యదర్శి పి. మహేష్, ప్రధాన పూజారి విద్యాసాగర్ హరిదాస్, వేద పండితులు మేఘరాజ్ శర్మ, కిరణ్ శర్మ, డీపీఎస్ సీనియర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి : రఘుపతి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జిల్లాకు పేరు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉష్కం రఘుపతి అన్నారు. సోమవారం అండర్ 16 బాలబాలికల కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలను స్టేడియంలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల మధ్య టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు వారి నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కబడ్డి అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కం రఘుపతి మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్‌లో ముప్కల్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయన్నారు. దాని కోసం జిల్లా జట్టు ఎంపిక కోసం అండర్-16 బాలబాలికల జట్టుకు పోటీలు నిర్వహించమన్నారు. క్రీడాకారులు వారిలోని నైపుణ్యాలను ప్రదర్శించారు. ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్రస్థాయిలో తమ సృజనాత్మకతను చూపిస్తూ రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపాల్, రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ జీసీడీవో ఛాయాదేవి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం

తలమడుగు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తలమడుగు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఐటీడీఏ జీసీడీవో మెస్రం ఛాయాదేవి అన్నారు. సోమవారం మండలంలోని ఆశ్రమ బాలికల పాఠశాల ఉమ్రి టీను జీసీడీఓ మెస్రం ఛాయ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆ తర్వాత పాఠశాల పరిసరాలు, వంటగదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు పరిశీలిస్తూ ఉండాలని ఏఎన్‌ఎంకి సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదువుకోవాలని కోరారు. ఇందులో హెచ్‌ఎం అరుణ, వార్డెన్ హిరామన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సిరికొండ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో రవీందర్ సోమవారం తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందించాలని మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు సకాలంలో భోజనం పెట్టకపోయినా, మెనూ పాటించకపోయినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను ఉపాధ్యాయులు ప్రతిరోజూ తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో సునీల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు.

సఖి ఆధ్వర్యంలో అవగాహన

ఉట్నూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ఎన్ఎస్ఎస్ మరియు సఖి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారుల భద్రత, బాలల హక్కుల గురించి, అలాగే మిషన్ శక్తి లక్ష్యాలు ఆదిలాబాద్ సఖి కేంద్రం ఇన్చార్జిలు యశోద నాగమణీలు విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో ప్రిన్సిపాల్ ధనరాజ్, అధ్యాపకులు శ్రీనివాస రావు, సువర్ణ, శ్రీలత, గణేష్ వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● జూమ్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అర్జీలను పెండింగ్‌లో లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి నుంచి ఆయా మండల తహసీల్దార్లతో జూమ్ ద్వారా ప్రజలు ఇచ్చిన అర్జీలపై ఆరా తీసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలిసారిగా జూమ్ ద్వారా అర్జీల వివరాలను తెలుసుకుంటూ వినూత్న కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో సమస్య పరిష్కరం కోసం ఇచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇక నుంచి ప్రతీ సోమవారం తహసీల్దార్లతో జూమ్ ద్వారా అర్జీలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. కాగా ప్రజావాణిలో 105 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇదిలా ఉంటే తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి ప్రజలు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వర్షాలకు గ్రామంలోని పదో వార్డులో వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడ్డామన్నారు. ఆస్పత్రి ఎదుట బ్రిడ్జి నిర్మాణానికి 30 లక్షల రూపాయలు అవుతుందన్నారు. కలెక్టర్ తన నిధుల నుంచి వాటిని మంజూరు చేసి మళ్లీ వర్షకాలం ప్రారంభమయ్యే లోపు పూర్తి చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్ర, ఆర్డీవో స్రవంతి, డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఎస్‌వో వాజీద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



జూమ్ ద్వారా అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

● గిరిజన దర్బార్‌లో పీవోను కలిసిన ఆదివాసీ గిరిజనులు

ఉట్నూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు పెందూరు పుష్పరాణి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఇంద్రవెల్లి మండలంలోని దొడంద గిరిజనులతో కలిసి పీవోకు వినతిపత్రం అందించారు. దొడందాకు చెందిన గిరిజనులు చాలా ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోడు భూములకు సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామన్నారని ఆమె తెలిపారు. ఇదిఇలా ఉండగా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పలు సమస్యలపై దరఖాస్తులను పీవోకు అందజేశారు. గిరిజనుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పీవో అన్నారు. ఇన్‌చార్జీ ఏపీవో దామెదర స్వామి, పీవీటీజీ ఏపీఓ మేస్రం మనోహర్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ గిరిజనులు

● ఆదివాసీ సంస్కృతీ పరిరక్షణకు కృషి చేయాలి

ఉట్నూర్: ఆదివాసీల సంస్కృతీ పరిరక్షణకు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు గొప్పవని, వాటి పరిరక్షణ చేస్తూ ముందుకెళ్లాలని అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రత్యేక సంచికను సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు నాయకులతో కలిసి ఆవిష్కరణ చేశారు. వ్యాసాలు ప్రత్యేక సంచిక రూపంలో తెచ్చిన టీఏజీఎస్ నాయకత్వానికి అభినందనలు తెలిపారు. సంఘం మండల కార్యదర్శి మడావి నాగోరావ్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.



బాధితులకు తిరిగి ఫోన్‌లను అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి ఎస్పీ భరోసా

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్న బాధితులు వెంటనే హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జీవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను తిరిగి సంపాదించడం కోసం ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందం గత నెల రోజుల వ్యవధిలో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి బాధితులు పోగొట్టుకున్న, దొంగలించబడిన 108 మొబైల్ ఫోన్‌లను తిరిగి రాబట్టారు. సోమవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశం మందిరంలో మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్న, చోరికి గురైన 108 మందికి మొబైల్ ఫోన్‌లను తిరిగి అందజేశారు. జిల్లాలో ఇప్పటివరకు 1050 ఫోన్‌లను బాధితులకు తిరిగి అందజేశామని తెలిపారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ గోపి కృష్ణ, రియాస్, మజీద్, త్రిశూల్, అన్వేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఇంజనీర్లది కీలకపాత్ర అని ఆర్కిటెక్ట్ ఇంజనీర్స్ అండ్ ఎల్టీపీ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నదానం జగదీష్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం ఇంజనీరింగ్ డే వేడుకలను నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి అతిథులు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఆయా కంపెనీల స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నదానం జగదీష్ మాట్లాడారు. గ్రామాలు, పట్టణాలతో పాటు రోడ్లు, ఇతర నిర్మాణ రంగంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సాబిర్, ఎల్టీపీలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం లేక గ్రామీణుల ఇక్కట్లు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ కేంద్రం లేక గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సోమవారం స్థానిక యువకులు ప్రజావాణిలో దరఖాస్తు అందించారు. ఈ సందర్భంగా డుబ్బుల శేఖర్ మాట్లాడుతూ ఆధార్ కేంద్రం లేక ప్రజలు పక్క మండలానికి వ్యయ ప్రయాసాలకోర్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో ప్రధాన కూడళ్లలో విద్యుత్ తీగలు తెగి పడకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్‌లో వోల్టేజ్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందులో ప్రభాకర్, శ్రీనివాస్, మణికంఠ, హరికృష్ణ, తాండ్ర శ్రీనివాస్, గిద్ది శంకర్, తాండ్ర సంతోష, తదితరులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఆర్టీసీ బస్సులో మంటలు

● అప్రమత్తమైన బస్సు డ్రైవర్

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

ఇచ్చోడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న బస్సులోకి ఒక్కసారి పొగలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపివేసి ప్రయాణికులను బస్సులో నుంచి దింపివేశాడు. బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు 45మందికి పైగా ప్రయాణికులకు ఎలాంటి అపాయం జరగ లేదు. బస్సులోంచి దిగిన డ్రైవర్ బస్సును ముందర నుంచి గమనించడంతో బస్సుకు మంటలు అంటుకున్నాయని తెలుసుకున్నాడు. అటుగా వెళ్తున్న మినరల్ వాటర్ ఆటోను ఆపి ఆ నీటితో మంటలను అదుపు చేయడానికి డ్రైవర్‌తో పాటు మరికొందరూ ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా.. అక్కడికి చేరుకున్న సిబ్బంది మండలను ఆర్పివేశారు. ఎవ్వరికీ ఎలాంటి నష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. తగు జాగ్రత్తలతో అప్రమత్తంగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె

ఉట్నూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ వాఖ ఆశ్రమ పాఠశాలలో వసతి గృహాల్లో పని చేస్తున్న దినసరి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు తెలంగాణ గిరిజన సంక్షేమ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో క్యాటరింగ్ విధానం కోసం తెచ్చిన జీవో 527 రద్దు చేయాలని, జీవో 60 ప్రకారం ప్రతినెలా రూ.15600 వేతనం ఇవ్వాలని వారు పలు డిమాండ్‌లను ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెను సమస్యలు పరిష్కారం అయ్యే వరకు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, రాందాస్, భరత్, రాంబాయి, బాదిరావు, మధు,క ఐలాస్, కపిల్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న దినసరి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరెల్లి రాజలింగు

బీజేపీ మండల సేవ పక్వాడ కార్యశాల

ఉట్నూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలోని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ స్వగృహంలో బీజేపీ మండల సేవా పక్వాడ కార్యశాల సోమవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్ అధ్యక్షత వహించగా.. కోకన్వీనర్ రాయలింగు హాజరయ్యారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17న కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర పార్టీ ఆదేశించడం జరిగిందన్నారు. స్వచ్ఛ భారత్, రక్తదాన శిబిరాలు, ఆత్మనిర్భర భారత్, వికసిత్ భారత్, స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాలు ఎన్నో చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇందులో మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, రామ్‌నాయక్, కొండేరి రమేష్, కార్యదర్శి ఆడే ధన్లాల్, తదితరులున్నారు.

'అంకితభావంతో పని చేయాలి'

తలమడుగు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసినప్పుడు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల వారీగా జీపీవోలను నియమించడంతో తలమడుగు మండలానికి కొత్తగా వచ్చిన జిపిఓలను ఆయా గ్రామాల వారీగా గ్రామాలు కేటాయించారు. అనంతరం వారితో తహసీల్దార్ మాట్లాడారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి'

ఉట్నూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పలువురు అంగన్వాడీ టీచర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్ ఎస్‌ను రద్దు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18 వేల వేతనం, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే ప్రత్యేక కార్యదర్శి భుజంగరావుకు వినతిపత్రం అందించారు. ఇందులో జిల్లా కోశాధికారి రత్నమాల, ఉపాధ్యక్షురాలు ముక్తానంద, మండలాధ్యక్షురాలు స్వర్ణలత, తదితరులున్నారు.

వికాసంలో సౌకర్యాలు కల్పించాలి

ఉట్నూర్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఐటీడీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రత్యేకబాలల బడి వికాసం పాఠశాలకు ఇంకా కొన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆత్రంనగేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని వికాసం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట విద్యార్థి సంఘం నాయకులు, తదితరులున్నారు.

'మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి'

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు శాపంగా ఉన్న మల్టీపర్పస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ అన్నారు. సోమవారం యూనియన్ జిల్లా 4వ మహాసభలను మాదవరావు స్మారక విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పాలడుగు సుధాకర్ ఈ సందర్భం గా డిమాండ్ చేశారు. అక్టోబరు 23, 24 తేదిల్లో మహబుబాబాద్‌లో రాష్ట్ర 5వ మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

నూతన పింఛన్లను మంజూరు చేయాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి ● ఆదిలాబాద్ జిల్లాలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు

బోథ్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు పెంచుతామన్న పింఛన్లను వెంటనే పెంచి నూతనంగా అర్హులైన వారందరికీ పింఛన్లను మంజూరు చేసి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడా స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రవి డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు మహబూబ్‌నాతో కలిసి స్థానిక తహసీల్దార్ సుభాష్ చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 45 లక్షల మంది దివ్యాంగులు, బీడీ కార్మికుల, చేనేత కార్మికులు, గీత కార్మికులకు పింఛన్లను పెంచి ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇందులో సమితి నాయకులు దాసరి రమేష్, రాజేశ్వర్, భోగ శంకర్, ఏరుగట్ల రాజు, హరీష్, రాంచందర్‌లు పాల్గొన్నారు.

నేరడిగొండ: నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికిపెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో తహసీల్దార్ ఖలీంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గజ్జెల అశోక్ మాట్లాడారు. ఇందులో జిల్లా నాయకులు గజ్జల సంతోష్, మండల నాయకులు నంది శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

తలమడుగు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచుతామని, అలాగే వృద్ధులు, వితంతువులతోపాటు ఇతర పెన్షన్‌దారుల పింఛన్లు రూ.4వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సోమవారం తహసీల్దార్ కు దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు ప్రసాద్, సత్యనారాయణ, ఆడేశ్ల గంగన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమేందర్, నర్సింగ్, ప్రసాద్, రూపేందర్, సందీప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన పింఛన్ హామీని వెంటనే నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ శ్యాం సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోట్ ముక్లే మధుకర్ మాట్లాడారు. అనిల్, స్వామి, సీతారాం, గణపతిలు ఉన్నారు.



బోథ్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇంకెన్నాళ్లు?

(5వ పేజీ తరువాయి...)

పట్టా పాస్‌బుక్‌తో పాటు ఆధార్‌కార్డును చూపితేనే యూరియాను విక్రయిస్తున్నారు. అయినా కొందరు గుట్టుచప్పుడు కాకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా మహిళలు కూడా యూరియా కోసం క్యూలు కడుతున్నారు. సొసైటీల వద్ద రైతులకు కనీసం మంచినీటి సౌకర్యాన్ని కూడా కల్పించడం లేదు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు తడుస్తూ క్యూలైన్‌లలోనే నిలబడుతూ గోస పడుతున్నారు. అయినా చివరి వరకు యూరియా దక్కుతుందో? లేదో? తెలియని పరిస్థితి ఉందని అన్నదాతలు వాపోతున్నారు.

ఎరుపుబారీ పోతున్న పంటలు

సమయానికి యూరియా, ఎరువును వేయక పోవడంతో పంటల ఎదుగుదలపై ప్రభావం పడుతుందని రైతులు చెబుతున్నారు. సరైన ఎదుగుదల లేక పంటలు ఎరుపుబారీ పోతున్నాయి. దీంతో ఆశించిన దిగుబడులు చేతికి రాక నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు. జిల్లాలో గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని పంటలు జౌకుబట్టి ఎదుగుదల నిలిచి పోతోంది. ఇలాంటి సమయంలో యూరియా వాడకం తప్పనిసరిగా మారింది. అలాగే పత్తికాయల ఎదుగుదల లేక దిగుబడులపై ప్రభావం పడుతుందని పేర్కొంటున్నారు. అధిక వర్షాలు, యూరియా కొరతతో అన్నదాతలు అల్లాడుతున్నారు.

బురద నేలల్లో కష్టమే..

అధిక యూరియా వాడకం వల్ల నేల సారం దెబ్బతింటుంద ని శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేయడంతో ప్రభుత్వం నానో యూరియా వైపు రైతులను మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. కానీ నానో యూరియా వైపు రైతులు అంతగా ఆసక్తి చూపినట్లు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో నానో యూరియా వాడకం అంత సులువైనా పనేమీ కాదంటున్నారు. ఇది మెట్ట పంటలకే అనుకూలమని, వరి పంటకు కొంత ఇబ్బందికరంగానే ఉంటుందని చెబుతున్నారు. ఎందుకంటే బురద నేలల్లో నానో యూరియాను పిచికారి చేయడం చాలా కష్టంగా ఉంటుం దని రైతులు చెబుతున్నారు. అలాగే సమయం కూడా అధికంగానే పడుతుందని పంటలపై నానో యూరియా ప్రభావం ఎక్కువ రోజుల పాటు ఉండదంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో నానో యూరియా వైపు రైతులు మొగ్గు చూపడం లేదని తెలుస్తుంది.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య జాతీయోద్యమంలో అఖిల్ భారతావణిని జాగృత పరిచి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు ఎంతగానో దోహదపడిందని, ఆ భాషను ప్రతీ ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ముత్నూర్ ప్రిన్సిపాల్ శ్రీప్రియ అన్నారు. జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ముత్నూర్‌లో హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీప్రియ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, భార్గవి, అరుణ, రాధ, గౌతమీ, వెంకమ్మ, జీఎస్‌ఎం సంధ్య, చాందిని, రత్నమాల, ఎల్లమ్మ, ఛాయా, మానస, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: పట్టణంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర కళాశాలలో హిందీ దివస్ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్.శివకృష్ణ, హిందీ విభాగపు అధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొని... హిందీ భాష ప్రాధాన్యతను తెలిపారు.

ఇచ్చోడ: జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడతూ.. దేశ ఐక్యతకు హిందీ ఒక సాధనమన్నారు. కళాశాల హిందీ అధ్యాపకుడు హింగోళి సత్యనారాయణ రావ్, తదితరులున్నారు.

బుర్కిగ్రామంలో వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్దరి సబ్ సెంటర్ పరిధిలోని బుర్కి గిరిజన గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ సుభాష్ తెలిపారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామని, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపామని అన్నారు. దోమలతో డెంగీ, మలేరియా వ్యాధులు వస్తాయని, దోమల నివారణకు తగిన జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

'రైతాంగ పోరాటాన్ని వక్రీకరించడం సరికాదు'

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భూమి, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ హిందూ, ముస్లిం పోరాటంగా వక్రీకరించి చెప్పడం సరికాదని, ప్రజాస్వామిక వాదులు దీన్ని ఖండించాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు అన్నారు. సోమవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏరియా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న వ్యతిరేక వినాదాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ నాయకులు స్వామి, గంగారం, స్వామి, కోట్నాక్ సక్కు, అడెల్లు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్సీడీ ఆన్‌లైన్‌లో ప్రోగ్రాంల నుంచి ఏఎన్ఎంలను తొలగించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలతో కలిసి ధర్నా నిర్వహించారు.

'ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి'

తలమడుగు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలకు సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్ అందజేశారు. హెచ్ఎం దివాకర్, చంద్రబాన్, ఉపాధ్యాయులు దివ్యశ్రీ, అశోక్, ప్రకాష్, వినోద్, మాజీ డిసిసిబి చైర్మన్ దామోదర్ రెడ్డి, కేదారీశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు రక్షణ కల్పించాలి

● మహిళా సంఘాల డిమాండ్

బోథ్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఆడపిల్లలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హాస్టల్‌ను సందర్శించి హాస్టల్లోకి యువకులు ఏ విధంగా ప్రవేశించారనే విషయాన్ని పరిశీలించడం జరిగింది. అనంతరం అక్కడే ఉన్న సెక్టోరల్ అధికారి ఉదయశ్రీతో చర్చించారు. తల్లిదండ్రులు మారుమూల ప్రాంతాల నుంచి విద్యార్థులను ఉపాధ్యాయులపై పూర్తి నమ్మకంతో పాఠశాలకు పంపిస్తున్నారని అయితే పాఠశాలలో యువకులు ప్రవేశించడంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైందని ఆమె ఎస్ఓకు వివరించారు. ఇకముందు పిల్లలకు ఏదైనా జరిగితే ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. సంఘటన జరిగిన రోజు విధుల్లో ఉన్న వారిపైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె వెంట పలువురు మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

కుక్కదాడిలో ఐదు పశువుల మృత్యువాత

బోథ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని చింతలబోరి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క కరవడంతో ఐదు పశువులు మృత్యువాత పడ్డాయి. అంతేగాక మరో రెండు పశువులకు రేబిస్ వ్యాధి సోకడంతో ప్రాణాపాయస్థితిలో ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. శనివారం మూడు ఆవులు, ఒక లేగదూడ, ఒక గేదె మృతి చెందాయని గ్రామస్థులు తెలిపారు. కాగా, పిచ్చికుక్కను గ్రామస్థులు హతమార్చడం. అయితే గ్రామంలో ప్రజలు భయాందోళన గురవుతున్నారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, వాటిని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇళ్ల అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలోని కొమరం భీమ్ చౌరస్తాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులలో అవినీతి అక్రమాలు జరిగాయని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, బహుజన కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డబుల్ బెడ్ రూమ్ సాధన కమిటీ కన్వీనర్లు తోట రాధ, గౌస్, మాజీద్‌ఖాన్, సయ్యద్ షాదుల్లా, కమల, లక్ష్మీ, రుక్మా పాల్గొన్నారు.

మొరం తవ్వకాల అనుమతులు ఇవ్వాలి

సారంగాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణం కోసం మొరం తవ్వకాలకు అటవీశాఖ అధికారులు అనుమతులను ఇవ్వాలని గిరిజన గ్రామాల ప్రజలు అన్నారు. సోమవారం మండలంలో గల పెందలాదారి, ఇప్ప చెలమే, అంతుల్‌వాయి, సిరిపెల్లి, రాంసింగ్ తండా ప్రజలతో పాటు ఆయా పార్టీల నాయకులు తహసీల్దార్ సంధ్యారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాథోడ్ నారాయణ్, ప్రకాష్‌లతో పాటు ఆయా పార్టీ నాయకులు, గిరిజన ప్రజలు, ఉన్నారు.

కరాటే విద్యార్థులకు అభినందన

దిలావర్‌పూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్గాపూర్ ప్లేయర్ హైస్కూల్ విద్యార్థులు బెల్ట్ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో పాఠశాలకు చెందిన 75 మంది విద్యార్థులు జూనియర్ రెడ్ బెల్ట్, ఒకరు బ్లూ బెల్ట్, మరొకరు గ్రీన్ బెల్ట్ సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ కేవీ. నరసింహ రెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సెన్సై రాహుల సుదర్శన్, తేజందర్ సింగ్ భాటియా, నేషనల్ కోచ్ సాయికిరణ్, ప్రిన్సిపాల్ సాయికిరణ్, బండి రాజు పాల్గొన్నారు.

గ్రామ విద్య ప్రాజెక్ట్ ప్రారంభం

భైంసా రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ విద్య ప్రాజెక్టు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రఘు ప్రారంభించారు. గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ చైర్మన్ నరేష్ విద్యా వాలంటీర్లకు బోధించుటకు ప్రతి నెల రూ. 3,000 ఇవ్వడం జరిగింది. వారికి గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వసంత, ఉపాధ్యాయులు ఎల్లన్న, మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి, చైర్మన్ భోజవ్వ, మాజీ ఉప సర్పంచ్ ఈశ్వర్, గ్రామ పెద్దలు,పాల్గొన్నారు.

సాయుధ పోరాట వార్షికోత్సవాలు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 77వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విలాస్, జిల్లా కార్యదర్శి రమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కైలాష్, ఎస్ఎన్ రెడ్డి, గంగయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో మహా అన్నదానం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రామాలయంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన ఆడెపు సురేష్ నాగమణి దంపతులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ సభ్యులు మాట్లాడుతూ... రామాలయంలో ప్రతి సోమవారం అన్నదానం కొనసాగుతుందని తెలిపారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించాలనుకునే భక్తులు ముందుగా ఆలయ పూజారుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగించగలమని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పప్పన్నం వండి కిచిడి అంటారా?

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించడు అన్న ట్లు గురుకుల పాఠశాలల పరిస్థితి తయారవుతోందనడానికి ఖానాపూర్ మహాత్మాజ్యోతి బాపూలే బాలుర పాఠశాలలో సోమవారం చోటుచేసుకున్న ఘటన నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పాఠశాలలో సోమవారం ఉదయం తనిఖీ చేశారు. ఈ తనిఖీని ఎమ్మెల్యే ఎన్నటికీ మరిచిపోని విధంగా పాఠశాల సిబ్బంది వ్యవహ రించారు. ఏకంగా ఎమ్మెల్యేనే ఏమార్చిన ఘనత ఈ పాఠశాల సిబ్బందికి దక్కింది. సోమవారం మెనూను పరిశీలించిన ఎమ్మెల్యే మెనూ ప్రకారం ఉదయం టిఫిన్ అందిస్తున్నారా? అని ఆరా తీశా రు. విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించాల్సిన సమయంలో కిచిడి సాంబార్ ఇవ్వాలని మెనూలో ఉంది. దీంతో విద్యార్థులకు ఈరోజు ఏం పెడుతు న్నారని ఎమ్మెల్యే ప్రశ్నించ డంతో ఇటు పాఠశాల ప్రిన్సిపాల్ సమక్షంలోనే వంట మనిషి కిచిడి సాంబార్ పెడుతున్నట్లు తెలి పారు. వెంటనే అక్క డి నుంచి కిచెన్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యే విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడ కిచిడి సాంబార్‌కు బదులు విద్యార్థులకు పప్పు, అన్నం పెడుతున్నారు. దీంతో ఇదేంటన్న ఎమ్మెల్యే ప్రశ్నించడంతో దీన్నే కిచిడి అంటాం సార్ అని వంట సిబ్బంది చెప్పడంతో ఎమ్మెల్యే అవాక్క య్యారు.స్వయంగా విద్యార్థులకు వడ్డించి అందులో ఒక పప్పు గింజనైనా కనిపిస్తుందేమోనని పరిశీలించారు. కనీసం ఒక్క పప్పు గింజ కూడా కనిపించక పోవడంతో ప్రిన్సిపాల్ సంతోష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేశారు. అనంతరం స్టాఫ్ రూమ్‌లో ప్రిన్సిపాల్ సహ ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్యే క్లాస్ ఇచ్చారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం గురుకులాల విద్యార్థులకు ఉన్నతమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలుచేపడుతున్నా క్షేత్రస్థాయిలో అమ లు చేయడంలో కొంత మంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




కిచెన్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కడెంలో భవిత సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

కడెం: కడెం మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో నూతన 'భవిత సెంటర్' భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్, ఏఎంసీ డైరెక్టర్‌లు, ఆర్‌టీఏ మెంబర్, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పెంబి:విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీఎస్ పాఠశాలలో భవిత సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంత రం ఈ నెల 24 నుండి నిర్వహిస్తున్న పీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ టీ షర్టలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి,ఎంఈవోరాంచందర్,తహసీల్దార్ లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

పింఛన్లు పెంచకుంటే ఆందోళన చేస్తాం



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేస్తున్న పెన్షన్‌దారులు

భైంసా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల పెంపుదలను సత్వరమే చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేయక తప్పదని వికలాంగుల సంఘం జిల్లా ప్రతినిధులు బురుగుల రాజు, జనసేన జిల్లా ప్రతినిధి సుంకెట మహేష్‌బాబు, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధి నంద కుమార్ మాదిగలు వెల్లడించారు. సోమవారం పెన్షన్ల పెంపుదలను చేపట్టాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి, ఎంఆర్‌పీఎస్ శ్రేణులు సంయుక్తకంగా నిర్వహించిన తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల మెనిఫెస్టోలో పెన్షన్ల పెంపుదలపై రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీని అమలు పరచకపోవడం మూలంగా పింఛనుదారులు కష్టనష్టాలను ఎదుర్కొవాల్సి వస్తోందని అవేదన వ్యక్తం చేశారు. పింఛనుదారుల గోడును కాంగ్రెస్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రాతినిధ్యంలో పింఛనుదారులు ప్రధాన రోడ్డు మార్గం నుంచి తహసీల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రవేశ మార్గం వద్ద ఆందోళనలు చేపట్టి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు సంబంధిత విషయంలో వినతి పత్రం అందచేశారు. ఇందులో వికలాంగుల సంఘం ప్రతినిధులు బోజారెడ్డి, నర్సారెడ్డి, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధి సంజుతో పాటు డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల పింఛనుధారులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: నూతన పెన్షన్లు మంజూరు చేయాలని సోమవారం మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు పెన్షన్ దారులతో కలిసి తహసీల్దార్ బత్తుల విశ్వంబర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచిన నూతన పెన్షన్లు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ మెంబర్ క్రాంతి కుమార్, మండల అధ్యక్షుడు చెవులమద్ది నర్సయ్య, నాయకులు గంగాధర్, రామన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మారంపెల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

సోన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో తరచూ జరుగు తున్న సైబర్ నేరాలపై సోన్ మండలం పాక్‌పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోన్ పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. తెలియని యాప్, మెసేజ్‌ల లింక్‌లపై టచ్ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులువెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు

నిర్మల్ రూరల్/కుంటాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఇంజనీర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వడ్లకొండ వెంకటపతి, రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బూర ఉమాశంకర్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ జాదవ్ చందు, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్న మాట్లాడుతూ భారత జాతిరత్న మోక్షగుండం విశ్వేశ్వర్య జయంతిని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ముథోల్/లక్ష్మణచాంద/కుంటాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో సోమవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో తహ సీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక లకు ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి జి. మహేశ్వర్ పేర్కొన్నారు. వికలాంగులకు, వృద్ధులకు, బీడీ వర్కర్లకు, ఒంటరి మహిళలకు పెన్షన్ డబ్బులను పెంచి అందిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ అమలుపరచడం లేదని పేర్కొన్నారు. వెంటనే పింఛన్ డబ్బులు పెంచాలని, నూతన పింఛన్‌లు ఇవ్వాలని ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీలతకు, లక్ష్మణచాందఉప తహసీల్దార్ బాబు సింగ్‌కు,కుంటాల తహసీల్దార్ కమల్‌సింగ్ కు అందజేశారు. మొదట బస్టాండ్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయాన్ని ముట్టడిం చి వినతి పత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తుకారం, వికలాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు, పెన్షన్ పోరాట హక్కుల సమితి సభ్యులు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో లక్ష్మణచాంద వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు, ఎమ్మా ర్పీఎస్ నాయకులు, రాజు మాదిగ,వెంకట రమణ మాదిగ, కత్తెరపాక శంకర్ మాదిగ, గంధం గంగాధర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కుబీర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన వడ్‌గామ్ బాబు(62) అనే వృద్ధుడు ఆదివారం నిజామాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందనట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. మృతుడు గత కొన్ని రోజులుగా ప్రతి రోజు మద్యం తాగుతూ భార్యను డబ్బులు ఇవ్వమని గొడవ పడేవాడు. ఆమె డబ్బులు ఇవ్వక పోవడంతో మనస్థాపం చెంది ఈ నెల 13వ తేదిన ఉదయం 10.30గంటలకు ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు భైంసాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగయిన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన సామాజిక కార్యకర్తలు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్‌ను సామాజిక కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజకవర్గం, నర్సాపూర్(జి) మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలపై ఆయనకు ఒక మెమోరాండం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు జాదవ్ మోతిలాల్ పటేల్, సయ్యద్ కలీం పాల్గొన్నారు. సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఎస్సారెస్పీలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

దిలావర్‌పూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ గ్రామ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సాంగ్వి గ్రామానికి చెందిన వ్యక్తులు చేపలు పట్టేందుకు వెళ్లగా మృత దేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించారు.గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడురెడ్ కలర్‌షర్ట్, నల్లని ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలి

ఖానాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ టీచర్లకు ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో సోమవారం పోషణ్ -బి, పడాయ్ - బి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గిరిజన క్రీడాకారుల ప్రతిభ

ఉట్నూర్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగులపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉట్నూర్‌లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని అన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉట్నూర్ ఏకలవ్య మోడల్‌రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు 200 మీటర్ల రన్నింగ్ పోటీలో రెండు బహుమతులు, లాంగ్ జంప్, హైజంప్ విభాగంలో మూడు బహుమతులు బాక్సింగ్ విభాగంలో నాలుగు బహుమతులు, రెజ్లింగ్ విభాగంలో రెండు బహుమతులు,రిలే రన్నింగ్ విభాగంలో ప్రథమ బహుమతి, జూడో విభాగంలో ద్వితీయ బహుమతి, ఫుట్‌బాల్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో క్రీడాకరంగంలో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాప్యం వచ్చినా.. బిడ్డ కోసం ఎందాకైనా

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి విభాగానికి ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టి) గ్రామానికి చెందిన ఎనభై ఏళ్ల వృద్ధురాలు శాంతబాయి తన కూ తురు కమలబాయితో కలిసి వచ్చారు. కూతురు ఇల్లు కూలిపోతోందని, కలెక్టర్ స్పందించి కొత్త ఇల్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎనభై ఏళ్ల వయసులోనూ బిడ్డ కోసం తాపత్రయ పడుతూ తల్లి ప్రేమ కడవరకు ఉంటుందని నిరూపించారు.


బిడ్డ కోసం కలెక్టర్‌ను కలిసిన శాంతాబాయి

● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అంగన్‌వాడీలకు శిక్షణ



అంగన్‌వాడీలకు శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీవో సరోజిని

ముథోల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బి పడాయి బి శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణ మూడు రోజులపాటు జరగనున్నట్లు సీడీపీవో తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు కార్యక్రమం బాల్య సంరక్షణ, విద్యపై అంగన్‌వాడీ వ్యవస్థపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బాల్య సంరక్షణ, విద్య, పోషకాహార సేవలను అందించడంలో నైపుణ్యాలను పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి సీడీపీవో వివరించారు. ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సమగ్ర బాల్య సంరక్షణ విద్యను అందించడం, పోషకాహార సేవలను మెరుగుపరచడం, అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంచడం తదితర వాటిని చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, సూపర్‌వైజర్లు ఉమా, అనిత, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా విష జ్వరాలు

» కిక్కిరిసిపోతున్న ప్రభుత్వాస్పత్రులు

బోథ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోథ్, సోనాల మండలాలలో వైరల్ జ్వరాల వ్యాప్తి ఉధృతంగా ఉంది. వాతావరణంలో ఆకస్మికంగా మార్పులు రావడంతో వైరల్ జ్వరాలు ఇంటింటా నిండుకున్నాయి. ప్రతి ఇంటిలో జ్వర బాధితులు ఉండటం వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి,ప్రైవేట్ ఆసుపత్రులకు వైద్యం కోసం రోగులు బారులు తీరుతున్నారు.


బోథ్ సివిల్ ఆస్పత్రిలో బెడ్లపై నిండుకున్న వ్యాధిగ్రస్తులు

● ప్రభుత్వాస్పత్రుల్లో...

బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లన్నీ రోగులతో నిండుకున్నాయి. ప్రతీరోజు 300 వరకు ఓపి పేషెంట్లు తరలివస్తున్నారు. దీంతో వైద్యం చేసేందుకు విధుల్లో ఉన్న డాక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు రోజుల పాటు ఒక డాక్టర్ విధులు నిర్వహించాల్సి వస్తుండడంతో వైద్యం చేసేందుకు డాక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎనిమిది మంది డాక్టర్లు ఉండాల్సిన ఆస్పత్రిలో కేవలం ముగ్గురు డాక్టర్లు ఉండడంవల్ల వైద్య సేవలు అందించడం కష్టంగా మారింది.


వైద్యం కోసం డాక్టర్ వద్ద క్యూ కట్టిన రోగులు

● గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

బోథ్, సోనాల మండలంలోని పలు గ్రామాల్లో వ్యాధుల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రభుత్వ వైద్యాధికారులు ఆయా మండలాల్లోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అనేక గ్రామాల నుంచి ఆస్పత్రికి చేరాలంటే బస్సు సౌకర్యం లేక ద్విచక్ర వాహనాలపై వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో వైద్య శిబిరాల నిర్వహించినట్లయితే వారి వారి గ్రామాల్లోని వైద్య సేవలు అందే ఆస్కారం ఉంది.

'కల్లు'కప్పుతున్నారు

● జోరుగా కల్తీ ఈత కల్లు విక్రయాలు
● అనారోగ్యం పాలవున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు

భీంపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విచ్చలవిడిగా ఈత కల్లు విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఈత చెట్లు లేకున్నప్పటికీ మందులు కలిపి ఈత కల్లును విక్రయిస్తున్నారు. పర్యావసానంగా యువకులు మొదలుకొని వృద్ధుల వరకు రసాయనాలు వేసి తయారు చేస్తున్న ఈ తెల్ల కల్లుకు బానిసలవుతున్నారు. అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ ఈత కల్లు తాగడం వల్ల చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారు. ఈత చెట్లు లేని ప్రదేశాల్లో అక్కడి దుకాణాలకు లైసెన్స్ ఉందో లేదో తెలియంటూ స్థానికులు వాపోతున్నారు. బయట నుంచి కొంత తెల్ల కల్లు తీసుకొచ్చి అందులో మత్తు మందు కలి పి విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తెల్లకల్లును అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు జోక్యం చేసుకోవాలని, అక్రమంగా తెల్ల కల్లు విక్రయిస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్న విక్రయ దారులపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.


భీంపూర్‌లో బహిరంగంగా కల్లు తాగుతున్న యువకులు

● ఈత కల్లుపై దృష్టి పెట్టాలి

అధికారులు దేశీ దారు, గంజాయి లాంటి వాటి పై ఉక్కుపాదం మోపడం సంతోషకరం. అయితే ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్న అనుమతి లేని ఈతకల్లుపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మండలంలో అసలు ఈత చెట్లు లేవు చెట్లే లేనప్పుడు కొందరు కల్లు ఎలా అమ్ముతున్నారో అర్థం కావడం లేదు. చాలా గ్రామాల్లో ఈత కల్లు తో యువత పనికి రాకుండా పోతుంది. కుటుంబా లు నష్ట పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.



- మేకల ప్రవీణ్, యువకుడు గుబ్‌డి, భీంపూర్ మండలం

● ఈత కల్లుతోనే మా సోదరుడికి అనారోగ్యం

గతంలో మా సోదరుడు ఈత కల్లుతో అనారోగ్యానికి గురయ్యారు. మేము ఆస్పత్రికి తీసుకెళ్లి స్తోమతకు మించి ఖర్చు చేసి సోదరుడి ప్రాణాలు దక్కించుకో గలిగాం. ఇప్పుడు ఈతకల్లు మానేశాక ఇప్పుడు ఆరో గ్యంగా ఉన్నాడు. ఈతకల్లుతో ఆదివాసి పల్లెలు కూడా ఎంతో నష్టపోతున్నాయి. ఈత కల్లు నిర్మూలించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి.



- కుంరా అయ్యు, గుంజల గ్రామం, భీంపూర్ మండలం

రోడ్డుపైనే విక్రయం.. రాకపోకలకు అంతరాయం


ఇచ్చోడలో జాతీయ రహదారి డివైడర్‌పై పశువుల సంత


అంగట్లో కాకుండా రోడ్లపైనే కొనసాగుతున్న పశువుల వ్యాపారం

» ప్రమాదాలు సంభవిస్తున్న పట్టించుకోని అధికారులు
» తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఇచ్చోడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం ఇచ్చోడలో జరిగే పశువుల సంత జాతీయ రహదారిపై, ఎన్‌హెచ్ 44పై సోమవారం పశువుల అంగడి జరిగింది. నాలుగు వరుసల జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా ప్రయాణిస్తుంటాయి. జీవాలు రోడ్డుపైకి వస్తే పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయి. వ్యాపారులకు అవేమి పట్టనట్టుగా రోడ్డుపైనే దర్జాగా దందా చేస్తున్నారు. ఇచ్చోడలో పశువుల సంత కోసం కేటాయించిన స్థలంలో కాకుండా ఏకంగా రోడ్లపైనే పశువుల వ్యాపారం చేస్తున్నారు. సంత స్థలం కాకుండా జాతీయ రహదారి, ప్రధాన రహదారులపైనే జీవాలను విక్రయిస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై జీవాలను విక్రయించకుండా వ్యాపారులను కట్టడి చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నూతన ఎంపీవోగా బాధ్యతలు స్వీకరణ

తానూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్న అనంత విశ్వేశ్వర్‌రావును సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పదోన్నతిపై ఎంపీవోగా విధులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీడీవో నసీరుద్దిన్, జూనియర్ అసిస్టెంట్‌లు సునీల్, రమణ , కోలూర్ పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డి కార్యాలయ సిబ్బంది సన్మానించారు.


ఎంపీవో విశ్వేరరావును సన్మానిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

జిల్లా స్థాయి యోగాలో రబీంద్ర విద్యార్థుల ప్రతిభ

ముథోల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ రబీంద్ర ఉన్నత పాఠ శాలకు చెందిన విద్యార్థులు ఇటీవల 4వ జిల్లా స్థాయి యోగా ఛాంపియన్‌షిప్ 2025 విభాగంలో తానూర్‌లో నిర్వహించిన యోగా పోటీలో మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఆనంవార్ సాయినాథ్ తెలిపారు. అండర్ -14-16 విభాగంలో కే. వాత్సల్య, జి. మధుప్రియ, ఎస్. యోగేశ్వరిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో, బాలుర విభాగంలో కే. మద్వేష్ మొదటి స్థానం, బాలికల విభాగంలో శ్రేయ 4వ స్థానంలో రాణించగా, జోయ ఫిర్దోష్, జే. స్పందన, 6, 7 స్థానంలో సత్త చాటారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు


లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బిజీ బిజీ

» ఇందిరమ్మ లబ్ధిదారులకు పత్రాల అందజేత
» నిబంధనలు ఉల్లంఘించొద్దని సలహా ఇచ్చిన ఎమ్మెల్యే
» ఏ ప్రభుత్వ స్థలమైన ప్రభుత్వం కేటాయించాకే నిర్మాణాలు చేపట్టాలని సూచన

ఖానాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్ బిజీ బిజీగా గడిపారు. ఖానాపూర్ పట్టణంలో నిశాం తినగర్‌లో నిర్మిస్తున్న బస్తీ దవాఖాన నూతన భ వనాన్ని కొంతమంది అడ్డుకుంటున్నారని వీడీసీ పెద్దలతా బీసీ రాజన్న, కొత్తపల్లి సురేష్, బక్కశెట్టి లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిశారు. దీంతో ఆ స్థలం ఎవరిది కాదని ప్రభుత్వ స్థలమని ఎమ్మె ల్యే స్పష్టం చేశారు. అయినప్పటికీ ఆ స్థలాన్ని ప్రభుత్వం భవన నిర్మాణం కోసం కేటాయిస్తేనే ఆ స్థలంలో నిర్మాణం కొనసాగించాలన్నారు. ఏదైనా అధికారికంగా జరగాలని వీడీసీలు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరించకూడదన్నారు. భవన నిర్మా ణం తాలూకు వివరాలను సంబంధిత డీఈఈకి ఫోన్ చేసి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో కొంతమంది ఆ భవన నిర్మాణం బొడ్డేని కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని చెబుతున్నారని, ఇప్పుడు వీడీసీ బృందమతా ఆ భవన నిర్మాణాన్ని ఆపొద్ద ని అడుగుతున్నారని ఒకే స్థలం విషయంలో ఇలాంటి వివాదాలు తలెత్తినప్పుడు అధికారులు వారి పనివారు చేసుకుపోతారన్నారు. అ నంత రం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సమావేశం హాట్ హాట్‌గా సాగినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా ఏకథాటిపై ఉండేలా ఎమ్మెల్యే ఇప్పటి నుండే చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు. అనంతరం దిలావర్‌పూర్ గ్రామానికి వెళ్లి అక్కడ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ వేర్వేరు కార్యక్రమాలలో ఏఎంసీ వైస్ చైర్మన్ మాజీద్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని ద యానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగిలి శంకర్, శెట్టి శ్యామ్మోహన్ రావు, పోలంపల్లి సచిన్, శేషాద్రి, సత్యనారాయణ, అధికారులు తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్ రావు, మున్సిపల్ కమిషన్ సుందర్‌సింగ్ సహా పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ఇంజనీరింగ్ డే


ఎస్ఏఈ క్లబ్ లోగోను విడుదల చేస్తున్న దృశ్యం

బాసర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీలో సోమవారం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి పురస్కరించుకొని ఇంజనీరింగ్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇంజనీరింగ్ ఆవిష్కరణల పరివర్తన శక్తిని హైలెట్ చేసే ఇంజనీరింగ్ ఎక్సలెన్స్ డ్రైవింగ్ ఇండియా ఫార్వర్డ్ అనే ఇతి వృత్తంపై దృష్టి సారించి, విద్యార్థులు సర్ విశ్వేశ్వరయ్య ఆవిష్కరణ వారసత్వం, విజయాలను కొసాగించాలన్నారు. అనంతరం ఎస్ఏఈ క్లబ్ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ప్రొఫెసర్ గోపాల్ టి. కృష్ణ, ఓఎస్‌డీ మురళీదర్శన్, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ-ఏ లో చేర్చాలి


కుంటాల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ నాయకులు

కుంటాల, సెప్టెంబర్, 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి బహిరంగ సభలో ఇచ్చిన మాట మేరకు ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ - ఏలోకి వెంటనే మార్చాలని ముదిరాజుల కుంటాల మండల అధ్యక్షుడు ఆలూరు ప్రశాంత్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముదిరాజులను బీసీ - డీ నుంచి బీసీ - ఏలోకి మారుస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి హామీ నెరవేర్చకపోవడం, ముదిరాజ్‌లకు సరైన నిధులు కేటాయించకపోవడంతో ముదిరాజ్‌లు అన్ని విధాలుగా నష్ట పోతున్నారని, ప్రస్తుతం ముదిరాజ్‌లకు న్యాయం జరగాలంటే బీసీ - డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ఆ సంఘం తరఫున సోమవాంర తహసీల్దార్ కమల్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సాయి, కోశాధికారి వెంకటేష్, కార్యనిర్వాహక సభ్యులు రవి ఉన్నారు.

గ్రామ పాలనాధికారులుగా..

మున్సిపల్ వార్డు అధికారుల ఎంపిక

» వీధుల్లో చేరేందుకు మున్సిపాలిటీల నుంచి రిలీవ్
» మున్సిపాలిటీల్లో ఖాళీ అవుతున్న వార్డు అధికారుల పోస్టులు

భైంసా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాల్లో వార్డు అధికారుల పోస్టులు ఖాళీ అవుతున్నాయి. గత సంవత్సరన్నర కాలంగా వార్డు అధికారులుగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న అధిక మంది గ్రామ పాలనాధికారి పోస్టుల కోసంగాను ఎంపికయ్యారు. వారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్రామ పాలనాధికారి నియామకపు పత్రాలను అందుకున్న ఆయా మున్సిపాలిటీల్లోని వార్డు అధికారులు మూ డు రోజుల క్రితం క్లస్టర్ కేంద్రాలకు కేటాయించబడ్డారు. దీంతో సోమవారం గ్రామ పాలనాధికారులుగా బాధ్యతలు చేపట్టేందుకు గాను మున్సిపల్ కార్యాలయాల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయా మున్సిపల్ కమిషనర్లు, అధికారులు వార్డు అధికారులను రిలీవ్ చేస్తూ పత్రాలను అందజేశారు.


మున్సిపల్ కమిషనర్ నుంచి రిలీవింగ్ పత్రాన్ని తీసుకుంటున్న వార్డు అధికారులు

● రెవెన్యూ శాఖ నుంచి వార్డు అధికారులుగా నియామకం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖలోని వీఆర్‌ఏ, వీఆర్‌వో పోస్టులను రద్దు చేసింది. సంబంధిత పోస్టులలో విధులు నిర్వహిస్తున్న వారిని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగానున్న పోస్టులలో భర్తీ చేసింది. ఇందులో భాగంగానే జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయాల్లో 30 మంది వార్డు అధికారులుగా నియమింపబడ్డారు. అయితే ఇందులో నుంచి 27 మంది గ్రామ పాలనాధికారులుగా ఎంపికయ్యారు. దీంతో వీరందరూ బుధవారం గ్రామ పాలనాధికారిగా బాధ్యతలు చేపట్టేందుకు గాను మున్సిపల్ కార్యాలయాల నుంచి రిలీవ్ అయ్యారు

● భైంసా లో 17 వార్డు అధికారుల పోస్టులు ఖాళీ

భైంసా మున్సిపల్ పరిధిలో 26 వార్డులు ఉండగా వీఆర్‌ఏ నుంచి 16 మంది, వీఆర్‌వో నుంచి ఇద్దరు మంది కలిపి మొత్తం 18 మంది వార్డు అధికారులుగా నియమిపంబడ్డారు. ఇందులో నుంచి 17 మంది గ్రామ పాలనాధికారులుగా ఎంపికవ్వడంతో వారందరూ బుధవా రం మున్సిపల్ కార్యాలయం నుంచి రిలీవ్ అయ్యారు.ఇక నిర్మల్ మున్సిపల్ పరిధిలో 42 వార్డులు ఉండగా ఇక్కడ వీఆర్‌ఏలు 5 గురు వార్డు అధికారులుగా నియమింపబడగా ఇందులో ముగ్గురు గ్రామ పాలనాధికారులుగా ఎంపికయ్యి రిలీవ్ అయ్యారు. ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 12 వార్డులలో 8 వార్డు అధికారుల పోస్టులు ఉండగా ఏడుగురు రెవెన్యూశాఖ నుంచి నియమింపబడ్డారు. ఇక్కడి మున్సిపాలిటీలో వార్డు అధికారులుగా విధులు నిర్వహిస్తున్న వారిలో ఏడుగురు గ్రామ పాలనాధికారులుగా ఎంపికయ్యారు. వీరందరూ మున్సిపాలిటీల నుంచి రిలీవ్ అవుతుండటంతో సంబంధిత వార్డు అధికారుల పోస్టులు ఖాళీగా అయిపోతున్నాయి.



భైంసా మున్సిపల్ కార్యాలయం

● మున్సిపల్ సేవలపై ప్రభావం

ఏడాదిన్నర కాలంగా మున్సిపల్ కార్యాలయాల్లో వార్డు అధికారులు విశిష్ట సేవలు అందించారు. సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వాహణ, వివిధ సర్వేలు, పౌర సేవలు, పన్నుల వసూళ్లు, మౌళిక వసతుల పర్యవేక్షణ తదితర విభాగాల నిర్వాహణ ప్రధాన భాగస్వామ్యం అందించారు.మున్సిపాలిటీల పరిధిలో ఎలాంటి కార్యక్రమాల నిర్వాహణ వ్యవస్థ జరిగిన అందులో వార్డు అధికారులు ప్రధాన పాత్ర పోషించారు. మున్సిపల్ కార్యాలయాల్లో ప్రధాన విభాగాల పోస్టులు ఖాళీగా ఉండగా సంబంధిత విభాగాలకు పనులన్నింటినీ వీరందరు చక్కదిద్దేవారు. ఇలాంటి ప్రధాన భూమిక పోషించే వార్డు అధికారుల పోస్టులు ఖాళీగా అవుతుండటంతో మున్సిపల్ సేవలపై ప్రభావం చూపే పరిస్థితులు నెలకొని ఉన్నాయి.ఖాళీగా ఏర్పడ్డ వార్డు అధికారుల పోస్టులను త్వరితగతిన పూర్తి చేసి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కేంద్రాలవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME & DOB

I, SHILA SHAKUNTHALA, MOTHER OF 16117507P, RANK HAV SHANKER S R/O.H.NO. 3-11, JAI SRI RAM NAGAR, VILLEGE & MANDAL: KUBEER, DIST: NIRMAL-504103, TELANGANA STATE. MY SON ARMY RECORD MY NAME IS WRONGLY ENDORSED AS SHAKONTALA & DATE OF BIRTH: 23/07/1958. CORRECT NAME IS SHILA SHAKUNTHALA & CORTECT DATE OF BIRTH IS:01/01/1959.
AJZ

CHANGE OF NAME & DOB

I, KADAM DEELIP FATHER OF 16131259P, RANK SPR KADAM SAINATH R/O.H.NO. 2-43/2, VILLEGE: NIGHWA, MANDAL: KUBEER, DIST: NIRMAL-504103, TELANGANA STATE. MY SON ARMY RECORD MY NAME IS WRONGLY ENDORSED AS DILEEP & DATE OF BIRTH: 09/06/1976. CORRECT NAME IS KADAM DEELIP & CORTECT DATE OF BIRTH IS:01/01/1976.
AJZ

CHANGE OF NAME & DOB


I, KADAM LALITHA MOTHER OF 16131259P, RANK SPR KADAM SAINATH R/O. H.NO. 2-43/2, VILLEGE: NIGHWA, MANDAL: KUBEER, DIST: NIRMAL-504103, TELANGANA STATE. MY SON ARMY RECORD MY NAME IS WRONGLY ENDORSED AS LALITHA & DATE OF BIRTH: 14/08/1979. CORRECT NAME IS KADAM LALITHA & CORTECT DATE OF BIRTH IS:01/01/1979.
AJZ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672



ఇండోర్ మైక్రో గ్రీన్..

- డీఆర్డీవో ఆధ్వర్యంలో మిల్లెట్ కల్చర్
- నిర్మల్ మండల సమాఖ్యకు పైలేట్ బాధ్యతలు
- దశల వారిగా అన్ని మండలాలకు విస్తరణ
- సూక్ష్మ హరిత ఆహారం పేరిట మొక్కల పెంపకం
- ఇప్పటికే కొనసాగుతున్న పొనికి ప్లాంటేషన్



హరిత ఆహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి (ఫైల్)



సూక్ష్మహరిత ఆహారం మొక్కలు

నిర్మల్,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):రోజు రోజుకు పౌష్టికాహార ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి మిల్లెట్ కల్చర్ పేరిట ఇండోర్ మైక్రో గ్రీన్ ప్లాంటేషన్‌ను ప్రయోగాత్మకంగా చేపడుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇందులో భాగంగానే నిర్మల్ జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంపై అంతస్తు భాగంలో ఈఇండోర్ మైక్రోగ్రీన్ ప్లాంటేషన్‌ను చేపడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో అత్యంత పోషకాలున్న కొర్రలు, రాగులు, సజ్జలు, గోధుమ, జొన్నలతో పాటు తదితర దినుసులను పంట చేనుల్లో కాకుండా మిద్దెసాగు పద్ధతిలో ఈ ఇండోర్ మైక్రో గ్రీన్ మిల్లెట్‌కల్చర్‌ను అమలు చేస్తున్నారు. అయితే నిర్మల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఈమిల్లెట్ కల్చర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో విజయవంతమైనట్లయితే దీనిని జిల్లాలోని అన్ని మండలాలకు విస్తరింపజేయాలని భావిస్తున్నారు. దశల వారిగా ఈ మిల్లెట్ కల్చర్‌ను గ్రామగ్రామాన విస్తరింపజేసి సాధారణ జనానికి పోషకాహారాన్ని అందించాలన్నదే ఈపైలేట్ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా చెబుతున్నారు. ఇప్పటికే డీఆర్డీవో ఆధ్వర్యంలో పలు ప్రయోగాత్మక కార్యక్రమాలు అమలవుతున్న సంగతి తెలిసిందే.కొండాపూర్ వద్ద ఇంటిగ్రేటెడ్ ఆక్వా, అగ్రి ప్లాంట్‌ను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో పాటు నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకునేందు కోసం ఆపరిశ్రమకు అవసరమయ్యే పొనికి కలప సాగును సైతం ప్రస్తుతం డీఆర్డీవో ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. వీటి ద్వారా పొదుపు సంఘాల మహిళలకు ఉపాధి లభిస్తుండడమే కాకుండా సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం లభిస్తోంది. డీఆర్డీవో ఆధ్వర్యంలో కొనసాగుతున్న పలు రకాల మొక్కల పెంపకం పూర్తిస్థాయిలో సెంద్రియ పద్ధతుల ద్వారానే సాగవుతోంది. రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతోనే ఈ పంట సాగును కొనసాగిస్తున్నారు. హరితహారంలో భాగంగానే ఈ పంటల సాగు విధానాన్ని అమలు చేస్తున్నారు.

మహిళ శక్తి పేరిట కార్యక్రమం అమలు

మహిళశక్తి పేరిట డీఆర్డీవో ఆధ్వర్యంలో మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.సూక్ష్మహరిత ఆహారం కింద ఈమిల్లెట్‌సాగును చేపడుతున్నారు.మ హిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థ మొత్తం ఈ సాగు ప్రక్రియతో పాటు రాబోయే రోజుల్లో మా ర్కెట్ సౌకర్యాన్నికూడాపర్యవేక్షిస్తుంటుంది.డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి గత కొంతకాలం నుంచి ఇలాంటి వినూత్న ఆలోచనాత్మక కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

విస్తరిస్తున్న మిల్లెట్ కల్చర్...

కాగా ప్రస్తుతం అనేక రకాల వ్యాధులు సాధారణ జనాన్ని వెంటాడుతున్న నేపథ్యంలో పోషకాహర ప్రాధాన్యత పెరుగుతోంది. దీనికి అనుగుణంగానే మిల్లెట్ కల్చర్ సైతం తెరపైకి వచ్చింది. మిల్లెట్ కల్చర్‌లో భాగంగా చాలా చోట్ల రాగులు, కొర్రలు, గోధుమ, జొన్నసజ్జతో పాటు వివిధ రకాల మిల్లెట్‌ల సాగును చేపడుతున్నారు.మార్కెట్‌లో వీటికి డిమాండ్‌తో పాటు మంచిధర కూడా ఉన్న కారణంగా డీఆర్డీవో ఈ దిశగాదృష్టిసారించింది. దీనికి అనుగుణంగానే నిర్మల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా మిద్దెసాగు పద్ధతిలో వివిధరకాల మిలెట్‌లను పండిస్తున్నారు.ఈపైలెట్ ప్రాజెక్టువిజయవంతమైనట్లయితేఇక అన్ని మండల సమఖ్యలకు శిక్షణనిచ్చి సా గుకు సంబంధించిన బాధ్యతలను అప్పగించనున్నారు.

ఇప్పటికే పొనికి కర్ర సాగు సక్సెస్...

కాగా నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమను రక్షించేందు కోసం డీఆర్డీవో ఆధ్వర్యంలో పొనికి ప్లాంటేషన్‌ను నిర్వహిస్తున్నారు. సాధారణంగా అటవీ శాఖ పొనికి ప్లాంటేషన్‌ను చేపట్టాల్సి ఉన్నప్పటికి ఈ దిశగా ఆశాఖ పెద్దగా దృష్టి సారించకపోవడంతో డీఆర్డీవో ఆ బాధ్యతలను తీసుకుంది. ఇందులో భాగంగానే మొదట మామడ మండల నర్సరీలో పొనికి కర్ర మొక్కలను పెంచారు. అయితే జర్మినేషన్ రాకపోవడంతో అటవీ, ఉద్యానవన శాఖల సూచనల మేరకు డీఆర్డీవో అధికారులు ఈ మొక్కలను ఉత్తరాఖండ్ నుంచి తెప్పించారు. మొత్తం 5వేల మొక్కలకుగానూ మహబూబ్‌ఘాట్ ప్రాంతంలో 2వేల మొక్కలను నాటారు. కోతుల బీభత్సంతో పాటు భూసారం లేని కారణంగా పొనికి మొక్క పెరగలేదు. దీంతో మామడ మండలంలోని జగదాంబ తండా అటవీ ప్రాంతంలోనూ లింగాపూర్‌లోనూ రెండు చోట్ల 3వేల పొనికి మొక్కలను నాటారు. ప్రస్తుతం ఈ మొక్కలు పెరుగుతుండడంతో మరికొన్ని సంవత్సరాల్లో పొనికి కలప అందుబాటులోకి రానున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఈ మొక్కలు నాటి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తోంది. మరికొంతకాలం పాటు ఆగితే పొనికి పంట చేతికి రానున్నట్లు చెబుతున్నారు.

ఎస్ఐఆర్ నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో సుదర్శన్‌రెడ్డి

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ 2002పై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాటాడుతూ... ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓట్లు, నకిలీ ఓట్లతో తొలగింపునకు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో చివరగా 2002 లో ఎస్ఐఆర్ చేయడం జరిగిందని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... ప్రతిఅసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్‌వో, డిప్యూటీ తహసీల్దార్‌లు, బీఎల్‌వో, పర్యవేక్షకులు తగినంత మంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి అవగాహన కలిగేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ నిర్వహణకు ముందుగానే ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్ఐఆర్ వివరాలను 2025 ఎస్ఎస్ఆర్ డేటాతో సరిపోల్చాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్,ఆర్డీవో రత్నకళ్యాణి, అధికారులు, పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లలో మాట్లాడుతున్న కలెక్టర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

» జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తు లను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. ప్రతి దరఖాస్తును పూర్తిగా పరిశీలించి, వెంటనే స్పందించాలని సూ చించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి అనంతరం అధికారులతో మాట్లాడిన కలెక్టర్, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వస్త్ నారీ - స్వశక్తి పరివార్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మహిళలకు రక్తహీనత, బీపీ, థైరాయిడ్, టీబీ, గర్భిణుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, నిపుణ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు జరుగనున్న పోషణ్ మా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక పోషకాహార కార్యక్రమాలు నిర్వహించి ఎనీమియా ముక్త నిర్మల్ సాధించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫేషియల్ రికగ్నిజేషన్ హాజరు విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ వంద శాతం హాజరు కావాలన్నదే తమ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



ఖానాపూర్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సవిత

ఖానాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సవిత అన్నారు. సోమవారం ఖానాపూర్‌లోని కార్యాలయంలో ఈడీఐఐ అండ్ యాక్సెంచర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆగ్రో మిల్లెట్స్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రొడక్ట్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ శిక్షణ శిబిరాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిల్లెట్ ప్రాసెసింగ్ ప్రొడక్ట్స్‌కి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. వీటిని తయారు చేయడం ద్వారా ఆదాయం పొందడంతో పాటు ఆరోగ్యాన్ని సైతం నలు గురికి పంచిన వాళ్లమవుతామని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో లింగ నిపుణులు జ్యోతి, మౌనిక, మెప్మా ఆర్పీలు, ఈడీఐఐ అండ్ అసెంచర్ మాస్టర్ ట్రైనర్ దేవేందర్ నాయక్, తదితరులున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

ప్రజలకు పోలీస్ సేవలు చేరువ చేయడమే లక్ష్యం

» ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

నిర్మల్‌రూరల్,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయడమేలక్ష్యమని జిల్లాఎస్పీ డా.జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి నిర్మల్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే ఫిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్లద్వారా బాధితులకు చట్ట పరంగా అందాల్సిన సహాయాన్నిఅందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్‌సేవలు మరింత చేరు వ చేయడమేలక్ష్యంగా,ప్రజాసమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట ప్రకారం బాధితులకు న్యాయంజరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారుడికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగు తుందన్నారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యా దులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏమేరకు పరిష్కారం అయ్యాయో విధంగా సమీక్షించుకుంటూ ప్రజలకు సేవలు అందించాలన్నారు.

ముంచెత్తిన జోరు వాన

» జలమయమైన అంతర్గత రోడ్లు » చెరువులను తలపించిన లోతట్టు ప్రాంతాలు



డబ్బాగల్లీలో వర్షపు నీరు



నీటిలో కొట్టుకపోతున్న కూరగాయాలు

భైంసా,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కేంద్రమైన భైంసాను సోమవారం రాత్రి భారీ వర్షం ముంచెత్తింది. ఏకబిగిన గంట పాటు కురిసిన జోరు వానతో భైంసా తడిసి ముద్దయ్యింది. వర్షపు నీటితో పలు వార్డులలోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. మురికి కాలువలు పొంగి పొర్లి ప్రవహించాయి. పట్టణ పరిధిలోని ఏ కాలనీలో చూసిన వర్షపు నీటి ప్రవాహమే కనిపించింది.రాహుల్ నగర్, డబ్బా గల్లి ప్రాంతాల్లోని పలు నివాస గృహాల ప్రవేశ మార్గాల వరకు వర్షపు నీరు ఉధృతి ప్రవహించింది. పలు కాలనీల పరిధిలో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ఎగువ ప్రాంతాల నుండి దిగువ ప్రాంతాల్లోకి ఉధృతితో ప్రవహించిన వర్షపు నీరు ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచి పోయాయి. దీంతో ఆయా ప్రాంతాలు చిన్నపాటి చెరువులు, కుంటలను తలపించాయి. రాత్రి 6.30గంటల నుండి ఏకదాటిగా గంట పాటు కురిసిన భారీ వర్షంతో ఇక్కడి వారంతపు సంతలోని క్రయ విక్రయదారులు తడిసి పోయారు.సంతలోని వ్యాపారులు వర్షపునీటి ప్రవాహానికి తమ విక్రయ సామగ్రి కొట్టుక పోకుండా కాపాడుకునేందుకు గాను పడరాని పాట్లు పడ్డారు.



సంతను చుట్టేసిన వర్షపు నీరు

ఫీజు బకాయిలు చెల్లించాలి

» విద్యార్థులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న కళాశాలల యాజమాన్యం



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫీజు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య సంఘ సభ్యులు మాట్లాడుతూ... తమకు రావలసిన బకాయి డబ్బులు న్యాయంగా మంజూరు చేయాలని నిరసన చేస్తున్నామని అంతేకానీ విద్యార్థులను ఇబ్బందులు పెట్టాలని తమ అభిమతం కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీల నిర్వహణ భారంగా మారిందని అందుకొరకు రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేసినట్లయితే విద్యార్థులకు రాబోయే రోజులలో నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య సంఘం సభ్యులు సాయిలు, సిహెచ్. వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు, అఖిలేష్ సింగ్, నర్సారెడ్డి, శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

భైంసా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంతంలో బుధవారం జిల్లా సబ్ జూనియర్ బాల,బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లుగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు నూతుల భూపతి రెడ్డి, బర్కుంట సునీల్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు 16సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా బాలురు 55 కిలోల లోపు, బాలికలు 50 కిలోల లోపు బరువుతో ఉండాలని తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తిగల విద్యార్థులు తమ తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో బుధవారం ఉదయం 9 గంటలకు భైంసాలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంతంలోని గ్రౌండ్‌కుతరలి రావాలని సూచించారు.రూ.వందలతో పీఈటీ సునీల్ వద్ద తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు.పూర్తివివరాల కోసంగాను సెల్ నెంబర్లు 6301843139, 9398366221 సంప్రదించాలని వెల్లడించారు.

యూరియా కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

భైంసా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):అధికార యంత్రాంగం యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం సంబంధిత విషయంలో పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ప్రస్తుతం సాగుబడిలో అత్యవసరంగానున్న యూరియా దొరకక అన్నదాతలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యూరియా అందుబాటులో లేకపైర్ల ఎదుగుదల,దిగుబడులపై ప్రభావం పడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.

ఇచ్చిన హామీలు అమలు పరచాలి

కడెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు పెంచి ఇస్తామన్న పింఛన్లు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు పరచాలని దివ్యాంగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కడెం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. హామీ ఇచ్చిన ప్రకారం పెన్షనన్లు పెంచి ఇవ్వాలని లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు.

జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు ఎంపిక

లక్ష్మణచాంద,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎం (టీచింగ్ అండ్ లర్నింగ్ మెటీరియల్) బోధన అభ్యసన సామాగ్రి మేళా నుండి జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాకు పలువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. జయశ్రీ పొట్టపెల్లి, బి. సుమలత నర్సాపూర్(డబ్ల్యూ), లక్ష్మీ మాచాపూర్, నర్మదా పొట్టపెల్లి(కే), కేశ్వత పీచర, వినయ్ మలాపూర్, శ్రీదేవి కాశిగూడ, సాయన్న రాచాపూర్, శిరీష ఒడ్డెపల్లి, అర్చన చింతల్‌చాంద తదితర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఈ నెల 18న జరిగే జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి అశోక్ వర్మ వెల్లడించారు. టీఎల్ఎం అనేది విద్యార్థులకు ప్రభావవంతంగా బోధించే ఒక ప్రత్యేక పద్ధతి. ఈ పద్ధతిలో ప్రభావంతంగా బోధిస్తున్న ఉపాధ్యాయులను ఈ మేళాకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, దాసరి శంకర్, సుదర్శన్, ప్రసాద్, మండలంలోనిఉపాధ్యాయులు, సీఆర్పీలు సుధాకర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తులు

సారంగాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జామ్ గ్రామ సమీపంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్ కోసం 341 బాలికల, బాలురు దరఖాస్తులను చేసుకున్నట్లు జిల్లా విద్యాధికారి భోజన్న, జిల్లా కోఆర్డినేటర్ ప్రశాంతిలు తెలిపారు. 5వ తరగతిలో అమ్మాయిల విభాగంలో ఎస్సీ 89, బీసీ 128, ఎస్టీ 5, ఓసీ 1 విద్యార్థినిలు దరఖాస్తులు అందజేయగా అబ్బాయిల విభాగంలో ఎస్సీ 56, బీసీ 53, ఎస్టీ9 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

నూతన ఎంపీవోగా బాధ్యతలు

తానూర్,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తానూర్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్న అనంత విశ్వేశ్వర్‌రావును సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పదోన్నతిపై ఎంపీవోగా విధులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

నర్సాపూర్(జి) బ్యాంకులో భారీ మోసం

» నకిలీ బంగారం తాకట్టుపై నోటీసులు జారీ
» రూ. 43 లక్షల రుణాల మోసం » ప్రధాన నిందితుడికి బ్యాంక్ గడువు



నర్సాపూర్(జి) ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద బాధితులు

నర్సాపూర్(జి),సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నర్సాపూర్ బ్రాంచ్‌ను మోసం చేసిన కేసులో బ్యాంక్ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ మోసంలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న కొండాజి ప్రశాంత్‌కు బ్యాంక్ నోటీసులు జారీ చేసింది. సుమారు రూ. 43 లక్షల మేర ఈ మోసం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

ఆడిట్‌లో వెలుగులోకి మోసం...

రీజినల్‌బిజినెస్ ఆఫీస్, ఆదిలాబాద్‌లోని శివాజీ చౌక్ కార్యాలయం నుంచి వచ్చిన ఎస్‌బీఐ అధికారుల బృందం సోమవారం నర్సాపూర్ బ్రాంచ్‌లో తనిఖీలు నిర్వహించగా ఈ మోసం బయటపడింది. ఆడిట్‌లో ప్రశాంత్ కొండాజి తన మిత్రుల పేర్లపై నకిలీ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి భారీగా రుణాలు తీసుకున్నట్లు తేలింది. ఈ మోసంలో సుమారు పది మంది కస్టమర్లు భాగస్వాములుగా ఉన్నారని బ్యాంక్ నోటీసులో పేర్కొంది.

అధికారుల బృందం నోటీసులు అందజేత...

ఆదిలాబాద్ రీజినల్ ఆఫీస్ నుంచి వచ్చిన సీఎం ఆపరేషన్స్ అధికారి పి. సత్యనారాయణ, హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ బాలకృష్ణ, నిర్మల్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ ఈనోటీసులను అందజేశారు. బ్యాంక్‌కు నష్టం కలిగించిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ప్రశాంత్‌కు నోటీసులో స్పష్టం చేశారు. రూ. 43 లక్షల రుణాలకు గాను ఇప్పటికే రూ. 25 లక్షలు తిరిగి చెల్లించారని,మిగిలిన రూ. 14 లక్షలు తిరిగి చెల్లించేందుకు ప్రశాంత్ రెండు రోజుల గడువు కోరారని అధికారులు తెలిపారు. మంగళవారం కూడా రికవరీ ఆపరేషన్ కొనసాగిస్తామని పి. సత్యనారాయణ పేర్కొన్నారు.

మోసంలో భాగస్వాములైన కస్టమర్లు, వారి రుణ వివరాలు...

బ్యాంక్ లెక్కల ప్రకారం..ఈ మోసంలో భాగస్వాములైన పది మంది కస్టమర్ల పేర్లపై ఉన్న రుణాల మొత్తం రూ. 25,66,422 వాటి వివరాలు. గాజుల గంగాధర్ రూ. 1,08,765, రూ. రూ. 1,90,000, రూ. 2,10,861, పవర్ రాజు రూ. 74,340, కుంబాజి నవీన్ రూ. 94,000, కొండగిరి నిఖిలేష్ రూ. 1,13,780, రూ. 2,15,477, బోధన్కర్ రాము రూ. 1,10,705, రూ. 2,15,159, గడ్డం దేవేందర్ రూ. 3,05,541, శ్రీపాదం కృష్ణ రూ. 2,36,739, బాయమొల్ల రాజేశ్వర్ రూ. 2,36,739, గరుడాజి రాము రూ. 2,35,850, షేక్ ఫహీం రూ. 2,41,447 నోటీసులో పేర్కొన్న గడువులోగా రుణాలను చెల్లించకపోతే నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేస్తామని, చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటన తో బ్యాంక్ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ విషయంపై పోలీసులు, ఉన్నతాధికారుల విచారణ కొనసాగుతోంది.

మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తాం

» జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):రాబోయే రోజుల్లో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తామని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంప్ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ 41వ స్థాపిక దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ,టౌన్ ప్రెసిడెంట్ వాసవి, సోన్ మండల ప్రెసిడెంట్ రేఖగౌడ్, సీనియర్‌నాయకురాలు లక్ష్మీజ్యోతి,కార్యకర్తలు పాల్గొన్నారు.